www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శని వారం, 06 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-120 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak



# బ్రాండ్ బేకార్ !

## కోమటిరెడ్డి బ్రదర్స్ బహుజన వ్యతిరేకులు ?

- నల్లగొండ గడ్డపై రాజకీయ నియంతలుగా కోమటిరెడ్డి బ్రదర్స్
- ఎస్సీ, బీసీలపై కోమటిరెడ్డి బ్రదర్స్ చిన్నచూపు
- బహుజనులు రాజకీయంగా ఎదిగితే ఓర్వలేరు
- కోమటిరెడ్డి బ్రదర్స్‌కు తలకెక్కిన ఆదిపత్య అహంకారం
- స్వార్ధరాజకీయకు నిలువెత్తు నిదర్శనం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి
- పది, పాతిక ఇచ్చి సేవా పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నంలో ముందంజ
- కాంట్రాక్టుల రూపంలో ప్రజల సొమ్మును కోట్లల్లో దండుకుంటున్న కోమటిరెడ్డి బ్రదర్స్
- కోమటిరెడ్డి బ్రదర్స్ కుట్రలను పసిగట్టిన మునుగోడు కాంగ్రెస్ కార్యకర్తలు
- కోమటిరెడ్డి బ్రదర్స్‌కు బుద్ధిచెప్పనున్న మునుగోడు నియోజకవర్గ ప్రజలు

2వ

## పదవుల కోసం వారి తాపత్రయం

### అభివృద్ధి పనుల సాకుతో కాంట్రాక్టులు, కమీషన్‌లు

- సొంత పార్టీని ఖూనీ చేయటంలో కోమటిరెడ్డి బ్రదర్స్‌కే సరిసాటి. ప్రస్తుతం రాజగోపాల్‌రెడ్డికి పరాయి పార్టీ కావచ్చు. కాని నిన్నటి వరకు రాజగోపాల్‌రెడ్డికి అన్నంపెట్టింది, పేరిచ్చింది కాంగ్రెస్ పార్టీనే కదా !. కాంగ్రెస్ పార్టీ నుంచి వరుస పదవులు అనుభవించిన కోమటిరెడ్డి బ్రదర్స్‌కు అహంకారం పీక్స్‌కు చేరింది. అన్నదమ్ముల పదవులకు అడ్డొచ్చిన ఎవ్వరినైనా నోటి దురుసుతో దూషించటం పరిపాటిగా మారింది. ఆ మాటకొస్తే పార్టీలో టీపీసీసీ, సీఎల్‌పీ పదవులకు అడ్డొచ్చారని భ్రమపడిన కోమటిరెడ్డి బ్రదర్స్ రేవంత్‌పై విషం గక్కుతున్నారు, తెలంగాణ ఉద్యమకారుడు, చెరుకు సుధాకర్ కాంగ్రెస్‌లో చేరడాన్ని ఓర్వలేని బహుజన వ్యతిరేకి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసలు స్వరూపం చెరుకు సుధాకర్‌పై చేసిన అనుచిత వాఖ్యలు, బహుజనులపై వారికున్న అక్కస్సు ఏమిటో బయటపడింది.

## ఫస్ట్ వాన్ని ప్రశ్నించాలి అంటూ రేవంత్‌పై ఫైర్

**3 ఏండ్ల కింద వచ్చినోడికి టీపీసీసీ,**
**34 ఏండ్లుగా ఉన్నోనికి స్టార్ క్యాంపేనియరా ? : వెంకట్‌రెడ్డి**

విలేకరుల సమావేశంలో టీపీసీసీ రేవంత్‌రెడ్డి పై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచిత వాఖ్యలు

"కాంగ్రెస్ పార్టీ అభిప్రాయాలను పక్కన పెట్టి కక్ష్యసాధింపు చర్యలలో భాగంగా ఢిల్లీ మీడియా సమావేశంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీ.పీసీసీ రేవంత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో తెలంగాణ ఇంటిపార్టీని విలీనం చేసిన చెరుకు సుధాకర్, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేశారు. అలాంటి ఉద్యమ నేత కాంగ్రెస్ పార్టీలో చేరితే ఓర్వలేకపోయిన కోమటిరెడ్డి బీసీల వ్యతిరేకిగా ముద్రవేసుకుంటున్నాడు. విలేకరుల సమావేశంలో విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పుకోలేక 3 ఏండ్ల కింద వచ్చినోడికి టీపీసీసీ, 34 ఏండ్ల నుంచి ఉన్నోనికి స్టార్ క్యాంపేనియారా అంటూ రేవంత్‌పై విషంగక్కారు. నన్ను ఓడించడానికి ప్రయత్నం చేసిన చెరుకు సుధాకర్‌ను ఎలా చేర్చుకుంటారు అని మండిపడ్డారు. వ్యక్తిగత ద్వేశాలకు పోతూ పదవుల కోసం తాపత్రయపడతారని మరోమారు కోమటిరెడ్డి బ్రదర్స్ వారి మాటల్లోనే రుజువు చేశారు.

## కాంగ్రెస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు

- రాజగోపాల్ రెడ్డి బాటలో దాసోజు శ్రవణ్
- పార్టీకి రాజీనామా సమర్పించిన అధికార ప్రతినిధి
- అమిత్‌షాతో భేటీ అయిన రాజగోపాల్ రెడ్డి
- 21న రాష్ట్రానికి వస్తున్న అమిత్ షా
- ఆయన సమక్షంలో బిజెపిలో చేరుతా
- తెలంగాణలో కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేస్తాం
- కెసిఆర్‌కు కనువిప్పు కలిగేలా మునుగోడు తీర్పు
- తెలంగాణ ఆకాంక్షలను తుంగలో తొక్కిన కెసిఆర్
- వెంకట్‌రెడ్డి కూడా సరైన నిర్ణయం తీసుకుంటారు
- అమిత్ షాతో భేటీ తరవాత రాజగోపాల్ రెడ్డి వెల్లడి
- అమిత్‌షాను పార్లమెంటులో కలిసిన వెంకట్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 4 (సమ సమాజం):** నల్లగొండ రాజకీయ నేతలు కోమటిరెడ్డి బ్రదర్స్ ఢిల్లీలో తెలంగాణ రాజకీయాలను వేడి పుట్టించారు. శుక్రవారం మధ్యాహ్నం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో కోమటిరెడ్డి బ్రదర్స్ భేటీ అయ్యారు. అయితే విడివిడిగానే.. ముందుగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. అమిత్ షాను కలిశారు. బీజేపీలో చేరిక, మునుగోడు బహిరంగ సభపై చర్చించినట్లు తెలుస్తోంది. అధికారికంగా మునుగోడు సభలోనే చేరతారనే సంకేతాలు అందుతున్నాయి. ఈ మేరకు భేటీ వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఈ నెల 21న అమిత్ షా సమక్షంలో బీజేపీలో చేరుతానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామితో కలిసి అమిత్ షాను ఆయన కలిశారు. తనతోపాటు బీజేపీలో చాలామంది చేరుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఉపఎన్నిక వస్తేనే నిధులు వచ్చే పరిస్థితి ఉందని..కేసీఆర్ కు కనువిప్పు కలిగేలా మునుగోడు తీర్పు ఉంటుందన్నారు. అభివృద్ధికి అధికార పార్టీ సహకరించడం లేదన్న ఆయన..అభివృద్ధి సిద్ధిపేట, సిరిసిల్లలకే పరిమితమైందని ఆరోపించారు. తెలంగాణ ఆకాంక్షలను తుంగలో తొక్కారని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. రైతు రుణమాఫీని అటకెక్కించారని అన్నారు. మునుగోడు ఉప ఎన్నిక తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో మార్పులు తెస్తుందని..మునుగోడు ప్రజలు

2వ

## అన్నా వెంకన్నా..నేను తిట్టింది తమ్ముడినే



3వ

- రాజగోపాల్ రెడ్డి వెన్నుపోటు పొడిచాడన్నది నిజమే కదా
- నువు మా పెద్దన్నవు..అపోహాలతో మనసు పాడుచేసుకోవద్దు
- నీకూ నాకూ మధ్య అగాధం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు
- మీడియాతో వివరణ ఇచ్చుకున్న పిసిసి చీఫ్ రేవంత్
- రాజగోపాల్‌లో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్

## వచ్చే నాలుగేళ్లలో దేశంలో 100 ఎయిర్ పోర్ట్స్ నిర్మాణం

ప్రవాస సమావేశంలో కిషన్ రెడ్డి వెల్లడి



2వ

## బడా వ్యాపారావేత్తల ప్రయోజనాలే వారి లక్ష్యం

- వారి కోసమే ఆ ఇద్దరూ పాటు పడుతున్నారు
- దేశంలో ప్రజాస్వామ్యం చనిపోతోందన్న బాధ
- గాంధీకుటుంబం అంటే ఒక సిద్ధాంతం
- మీడియా సమవేశంలో మోడీ ద్వయంపై రాహుల్ ధ్వజం

**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (సమ సమాజం):** ఇద్దరు-ముగ్గురు బడా వ్యాపారవేత్తల ప్రయోజనాల కోసం ఓ ఇద్దరు కలిసి దేశంలో నియంతృత్వ పాలన సాగిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ఈ మేరకు రాహుల్ ఎన్డీఏ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు . దేశంలో ప్రజాస్వామ్యం చనిపోతోందని అన్నారు. శతాబ్ద కాలంగా నిర్మించుకున్న భారత దేశాన్ని మన కళ్లముందే ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు.

3వ



## తెలంగాణపై సీమాంధ్రుల కుట్రలు

- కుక్కలు చింపిన విస్తరి చేసే పన్నాగాలు
- షర్మిల, కెఎ పాల్ ఎందుకు పర్యటిస్తున్నారు
- తెలంగాణపై కాంగ్రెస్, బిజెపిల కుట్ర రాజకీయాలు
- తెలంగాణను కాపాడుకునే శక్తి కెసిఆర్‌కు మాత్రమే ఉంది
- మంత్రి గంగుల కమలాకర్ సంచలన వ్యాఖ్యలు

**కరీంనగర్, ఆగస్టు 4 (సమ సమాజం):** తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిలా మార్చేందుకు సీమాంధ్ర పాలకులు ఇంకా కుట్రలు పన్నుతున్నారని మంత్రి గంగుల కమలాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.సాగునీటి కోసం తెలంగాణ ప్రభుత్వం

2వ



## ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చరిత్ర హీనుడు



- కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసిన నేత
- మునుగోడులో ఎగిరేది కాంగ్రెస్ జెండానే
- తెలంగాణతో సోనియాది పేగుబంధం
- మునుగోడులో ఓడినా పోయే నష్టం లేదు
- మునుగోడు సభలో కోమటిరెడ్డ బ్రదర్స్‌పై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

**నల్లగొండ, ఆగస్టు 4 (సమ సమాజం):** ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చరిత్ర హీనుడని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తీవ్రంగా దుయ్యబట్టారు. రాజగోపాల్‌రెడ్డి దుర్మార్గుడు, నీచుడు, నికృష్టుడని మండి పడ్డారు. మునుగోడు లో రాజగోపాల్ రెడ్డి చరిత్రహీనుడుగా మిగిలారని విమర్శించారు. నల్గొండ చండూరులో నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీకి ద్రోహం చేసిన నేత రాజగోపాల్‌రెడ్డి అని మండిపడ్డారు. నమ్మినవారిని మోసం చేసి కేంద్రమంత్రి అమిత్‌షా వైపు వెల్లాడని, కాంగ్రెస్ పార్టీలో పోరాటాలకు కలిసి రాలేదు కానీ.. కాంట్రాక్టుల కోసం అమిత్‌షా వైపు వెళ్తాడా? అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. పార్టీ ప్రతిష్టను అమిత్‌షా కాళ్ల దగ్గర తాకట్టు పెట్టి.. రాజగోపాల్‌రెడ్డి 21 వేల కాంట్రాక్టులు తెచ్చుకున్నారని ఆరోపించారు. ఉపఎన్నికలతో కాంగ్రెస్‌కు వెంట్రుక కూడా ఊడలేదని చెప్పారు. తెలంగాణ

2వ

## సంపాదకీయం

# దారికొస్తున్న కాశ్మీర్‌కు అండగా నిలవాలి

సరిగ్గా మూడేళ్లయ్యింది. అప్పటికీ ఇప్పటికీ ఎంతో తేడా కనిపిస్తోంది. జమ్మూ-కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని అందించే అధికరణం 370 రద్దు.. దేశం చరిత్రలో ఓ చారిత్రక ఘట్టంగా నిలిచిపోయింది. ఇలాంటి సాహసోపేత, చరిత్రాత్మక నిర్ణయానికి దారితీసిన పరిస్థితులు, కలిగే ప్రయోజనాలు దేశంలో ప్రజల అనుభవంలోకి వచ్చాయి. దీనిని రద్దు చేయడం ద్వారా దేశమంతా ఒక్కటే అన్న సందేశాన్ని ప్రధాని మోడీ చాటారు. ఇలాంటి ఇంకా ఎన్నో చర్యలు తీసుకోవాల్సి ఉంది. దేశంలో కుల,మత,ప్రాంతాల ప్రాతిపదికన ఉన్న అసమానతలు తొలగాలి. ప్రజలంతా ఒక్కటే అన్న భావం రావాలి. నిజానికి 370 అధికరణ రద్దు అన్నది కేవలం బిజెపికి మాత్రమే సాధ్యం అయిన చర్య. ఎన్నోఏళ్లుగా అపరిష్కృత సమస్యగా, గుదిబండగా ఉన్న 370 ఆర్టికల్‌ను పీకి పారేయడం అంత తేలికైనదిగా చూడరాదు. ఉగ్రవాదులకు మనుషులను అంతమొందించడమే తెలుసు. వారిని బతికించడం లేదా కాపాడడం తెలియదు. ఇస్లామిక్ తీవ్రవాదం పేరుతో సృష్టిస్తున్న మారణహోమం కారణంగా ఇంతకాలం కాశ్మీర్ సహా ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాలుగా లక్షల మంది హతమవుతున్నారు. అమాయక ప్రజలు జీవితాలను కోల్పోతున్నారు. ఎందరో క్షతగాత్రులగా జీవితనరకం అనుభవిస్తున్నారు. ఉగ్రదాడులకు తెగబడుతున్న వారు ఇస్లాంపేరు చెప్పి ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారు. భారత్‌లో ఎన్నో ఉగ్రదాడులు జరిగాయి. ప్రపంచం యావత్తూ కన్నా భారత్‌లోనే దాడులు ఎక్కువగా ఉన్నాయి. ఐఎస్ సృష్టిస్తున్న మారణహోమం వల్ల ఎందరో అమాయక ప్రజలు ఆహుతవుతున్నారు. సరిహద్దుల్లో స్వయంగా పాక్ ప్రభుత్వం ఉగ్రదాడులను ప్రేరేపిస్తున్నది. ఆల్‌ఖైదా, ఐసిస్, తాలిబన్, లష్కరే తోయిబా ఇలా పేర్లు ఏవైనా మారణహోమం సృష్టించడమే వారి పనిగా ఉంది. కాశ్మీర్ నిత్యరావణకాష్టంగా రగిలిపోవడానికి ఉగ్రవాదుల దుశ్చర్యలే కారణం. పైశాచికానందం వారికి అలవాటయ్యింది. ఇలాంటి సంస్థలను, ప్రోత్సహిస్తున్న వారిని అంతకతగా దారుణంగా తెగనరకాలి. పట్టుబడ్డవారిని విచారణలప పేరుతో కాలయాపన చేయరాదు. ప్రధానంగా భారత్‌లో ఉగ్రవాదులకు కొమ్ము కాస్తున్న వారిని బహిరంగంగా కడతేర్చాలి. ఇలాంటి చర్యలతో వారు ఉగ్రవాదులకు సాయం అందించాలం టేనే భయం కలిగేలా చేయాలి. కాశ్మీర్‌లో శాంతికోసం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగే క్రమంలో కేంద్రం కఠిన చర్యలకు ఉపక్రమించాలి. ఉగ్ర మూకలకు సహకారం ఇస్తున్న వారిని కిరాతకంగా శిక్షించాలి. కశ్మీరీ ప్రజలకు నమ్మకం, ఆశావహ దృక్పథాన్ని కలిగించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కృతకృత్యం అయ్యింది. అయితే కాంగ్రెస్, మెహబూబా ముఫ్తీ, ఫరూక్ అబ్దుల్లా వంటి వారు ఇంకా కాశ్మీర్ ప్రజలను భ్రమల్లో ముంచుతున్నారు. వారి రాజకీయ కుటిలాన్ని కూడా దేశానికి ప్రపంచానికి చాటాలి. ఈ సంకల్పంలో నిజాయితీ ఉంది. దీనికి అనుగుణంగా నడుచుకునేలా రాజకీయ పార్టీలు పనిచేయాలి. ఈ మహాజ్ఞంలో భాగస్వాములు అవుతారా లేదా అన్నది రాజకీయా పార్టీలు నిర్ణయిం చుకోవాలి. ఉగ్రవాదులు ఎప్పటికప్పుడు సవాళ్లు విసురుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచం యావత్తూ అప్రమత్తం కావాలి. ఉమ్మడిగా ఉమ్మడి శత్రువును ఎదుర్కోవాలి. కాశ్మీర్ కోసం ఎంతటి సాహసోపేత నిర్ణయాలకైనా వెనకాడరాదు. సీమాంతర ఉగ్రవాదాన్ని నిరోధించేందుకు ఎంతటి చర్యలకైనా దిగాల్సిందే. మతం పేరుతో సాగించే మారణహోమాన్ని తుదముట్టించి కాశ్మీర్ ప్రజలకు భరోసా ఇచ్చే క్రమంలో కేంద్రం అనేక విధాలుగా కసరత్తు చేయాలి. అభివృద్ధికి నిధులు వెచ్చించాలి. విద్య,వైద్యం,ఉపాధి రంగాలను మార్గాలుగా ఎంచుకుని ముందుకు సాగాలి. అప్పుడే విజయం సాధ్యం అవుతుంది. అందాల కశ్మీర్‌ను మళ్లీ భూతలస్వర్గం చేద్దామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు సాకారం అయ్యేలా కృషి సాగాలి. కాశ్మీర్ పునర్నిర్మాణంలో అంతా తమవంతు పాత్ర నిర్వహించాలి. కాశ్మీర్ విషయంలో స్వార్థ రాజకీయాలు పక్కన పెట్టాలి. దేశం యావత్తూ ఈ విషయంలో ఒక్కటిగా ఉందన్న సమాచారాన్ని ప్రజలకు ప్రపంచానికి తెలియచేయాలి. ఇందులో భాగంగా అంతా కలసి కాశ్మీర్ అభివృద్ధికి తమవంతుగా నడుం బిగించాలి. రాజకీయ విమర్శలు మాని అభివృద్ధికి పాటుపడాలి. అప్పుడే ప్రజలు విపక్షాలను ఆదరిస్తారు. లేకుంటే కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలతో సహా చిన్నాచితకపార్టీలకు కూడా భారత రాజకీయాల్లో ఇక స్థానం లేకుండా చేస్తారు. ఇన్నేళ్ల రాజకీయంలో ఓ సమస్యకు పరిష్కారం చూపే క్రమంలో చేస్తున్న ప్రయత్నాల్లో రాజకీయాలకు చోటివ్వరాదు. పాక్ బాలలహక్కుల నేతగా నోబెల్ ప్రైజ్ పొందిన మలాలా కూడా కాశ్మీర్ విషయంలో తన కుత్సిత బుద్దిని చాటుకున్నారు. ఆమెకు ఉదారభావాలు లేవని బయటపడ్డారు. పాక్‌లో తాలిబన్ల మారణ హోమాలు మరచి పోయి కాశ్మీర్ గురించి మాట్లాడడం ఆమె సంకుచిత స్వభావానికి నిదర్శనంగా చూడాలి. తాలిబన్ల దాడుల నుంచి ఆమె ప్రాణాలు దక్కించుకుని ప్రవాసజీవితం గడుపు తున్న విషయం మరచి పోయినట్లుగా ఉన్నారు. పాక్ గురించి,తాలిబన్ల ఘాతుకాల గురించి మాట్లాడలేని మూఢులు కాశ్మీర్ గురించి మాట్లాడడం క్షంతవ్యం కాదు. కాల్పుల మోతలు వినిపించని, ఉగ్ర భూత విషఛాయలు లేని ప్రశాంత కశ్మీరాన్ని సృష్టించుకుందామని నవ సంకల్పాన్ని జాతి ముందు ఆవిష్క రించారు. త్వరలోనే మంచి రోజులొస్తాయని కశ్మీరీలకు కూడా అనుభవంలోకి వస్తోంది. ఇప్పుడి ప్పుడే అక్కడా సాధారణ పరిస్థితులు నెలకొంటున్న ఆక్రమిత కాశ్మీర్‌లో తిష్టవేసిన ఉగ్రమూకలు ఇంకా దాడికి తెగిస్తూనే ఉన్నాయి. ఆక్రమిత కాశ్మీర్ సమస్య తెగగితే తప్ప కాశ్మీర్ సమస్యకు పరిష్కారం దక్కదు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# కాంగ్రెస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు

(మొదటి పేజీ తరువాయి..)ధర్మం వైపు ఉంటారన్న నమ్మకం తనకు ఉందన్నారు. అలాగే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా త్వరలోనే మంచి నిర్ణయం తీసుకుంటారని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. చెరుకు సుధాకర్ చేరిక పట్ల వెంకట్ రెడ్డి అసతృప్తితో ఉన్నట్లు చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన వాళ్లకు తగిన గుర్తింపు లేదని..తమకు పదవులు ముఖ్యం కాదని..ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధానమన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ పేరు ప్రతిష్ఠలను చూసి కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. బయటనుంచి వచ్చిన వ్యక్తికి పీసీసీ చీఫ్ పదవి కట్టబెట్టారని..ఆయనను ముఖ్యమంత్రి చేయడానికి మేము కష్టపడాలా అని ప్రశ్నించారు. తాను బీజేపీకి అమ్ముడుపోయినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. దమ్ముంటే రేవంత్ రెడ్డి తన సవాల్ స్వీకరించాలని చెప్పారు. కోమటిరెడ్డి బ్రదర్స్ తిట్టడం రేవంత్ రెడ్డి జీవితంలో చేసిన పెద్ద తప్పు అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డికి క్యారెక్టర్, క్రెడిబులిటి లేదన్నారు. ఇక పార్లమెంట్‌లోనే ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశారు. తెలంగాణ వరద సహాయం కోసమే హోం మంత్రిని కలిశానని, వరద కష్టాలపై షాతో చర్చించానని కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. వరదలతో రూ. 1,400 కోట్ల నష్టం వాటిల్లిందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. తాను ఈ భేటీకి వెళ్లకపోయి ఉంటే.. రాష్ట్రానికి నష్టం జరిగేదని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ కోసం పదవీత్యాగం చేసిన వ్యక్తిని తానని, పదవుల కోసం వెంటపడే వ్యక్తిని కాదని, ఒకవేళ పార్టీ మారాలనుకుంటే బరాబర్ చెప్పి పోతా అని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ సభ్యత్వానికి రాజీనామా చేసిన రాజగోపాల్ ఎమ్మెల్యే పదవిని వీడేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 8న స్పీకర్ ను కలిసి రాజీనామా లేఖ అందజేయనున్నారు. కేసీఆర్ రాక్షస, నియంతృత్వ పాలనకు అంతం పలకాలని బీజేపీ కోర్ కమిటీ సభ్యుడు వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి అమిత్ షాను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో రాజగోపాల్ కీలక పాత్ర పోషించారని, మునుగోడు నియోజకవర్గంలో పాపుల్ లీడర్ అని వివేక్ చెప్పారు. కేసీఆర్ పాలనకు వ్యతిరేకంగా మరో ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని ఏడాదిన్నర క్రితమే చెప్పారని ఇప్పటికైనా బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నందుకు రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కోసం మంచి నిర్ణయం తీసుకున్నారని అమిత్ షా సైతం రాజగోపాల్ రెడ్డిని అభినందించినట్లు చెప్పారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందని వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తెలంగాణ రాజపక్సగా అభివర్ణించిన ఆయన.. పరిస్థితి ఇలాగే కొనసాగితే శ్రీలంకకు పట్టిన గతే రాష్ట్రానికి పడుతుందని అన్నారు. లక్ష కోట్లు ఖర్చుపెట్టి కాళేశ్వరం కట్టినా చుక్క నీరు అందడంలేదని మండిపడ్డారు.

### వరుస ఎదురుదెబ్బలతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కుదేలవుతోంది

ఇప్పటికే మునుగోడు ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు రాజీనామా చేయగా పార్టీకి చెందిన కీలక నేత దాసోజు శ్రవణ్ కూడా రాజీనామా చేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో ప్రారంభమైన రాజీనామాల పర్వం ఇక్కడితో ఆగేలా కనిపించడం లేదు. ఆ తరువాత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా ఆయన పార్టీ మారుతారేమోననే ప్రచారాన్ని బలపరిచేలా ఉన్నాయి. ప్రస్తుతం దాసోజు శ్రవణ్ కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధిగా ఉన్నారు. గత ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. టి.కాంగ్రెస్‌లో విజయారెడ్డి చేరికపై దాసోజు శ్రవణ్ అసంతృప్తితో ఉన్నారు. దీంతో నేడు ఆయన తన రాజీనామాను ప్రకటించారు. ఇకపోతే శుక్రవారం ఉదయమే ఢిల్లీలో తెలంగాణ ఇంటిపార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన ఆనందం ఇంతలోనే ఆవిరయ్యింది. ఇంతకాల్ పార్టీకి అధికార ప్రతనిధిగా ఉన్న దాసోజు రాజీనామా చేయడం కలకలం రేపుతోంది. ఇదిలావుంటే రేవంత్ వ్యాఖ్యలు, చెరుకు సుధాకర్ చేరికతో ఆగ్రహంగా ఉన్నా ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా బిజెపిలోకి జంప్ అవుతారని ప్రచారం సాగుతోంది. రాజగోపాల్‌రెడ్డి తో పాటు వెంకటరెడ్డి కూడా కలవనుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా గడుపుతున్నారు. ఇందులో భాగంగా కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్ షాను కలిశారు. బీజేపీ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు వివేక్ వెంకటస్వామితో కలిసి రాజగోపాల్ రెడ్డి అమిత్ షాతో భేటీ అయ్యారు. బీజేపీలో చేరిక, మునుగోడులో బహిరంగ సభ ఏర్పాటు అంశంపై ముగ్గురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. ఢిల్లీ పర్యటనలో భాగంగా రాజగోపాల్ రెడ్డి బీజేపీకి చెందిన ఇతర నేతలను కూడా కలవనున్నట్లు తెలుస్తోంది. రాజీనామా ప్రకటించిన అనంతరం ఆయన ఢిల్లీకి రావడం ఇదే తొలిసారి. ఇదిలా ఉంటే కాంగ్రెస్ సభ్యత్వానికి రాజీనామా చేసిన రాజగోపాల్ ఎమ్మెల్యే పదవిని వీడేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 8న స్పీకర్ ను కలిసి రాజీనామా లేఖ అందజేయనున్నారు.

# ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చరిత్ర హీనుడు



(మొదటి పేజీ తరువాయి..) తల్లి సోనియగాంధీ అని కొనియాడారు. తెలంగాణ ఆకాంక్షలు నెరవేర్చారని తెలిపారు. మునుగోడులో ఎగిరేది కాంగ్రెస్ జండానేనని ధీమా వ్యక్తం చేశారు. మునుగోడులో కాంగ్రెస్ ఓడినా తమకేం కాదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసినవారికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా కుట్రల వల్లే సోనియాపై ఈడీ విచారిస్తోందని మండిపడ్డారు. సోనియాకు తెలంగాణతో పేగుబంధం ఉందని తెలిపారు. కాంగ్రెస్‌ను ఎదుర్కొనే సత్తాలేకే ఈడీతో దాడులు చేయిస్తున్నారని రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. మునుగోడు ప్రజల విశ్వాసాన్ని రాజగోపాల్ రెడ్డి పోగొట్టుకున్నారని ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాజగోపాల్ రెడ్డి చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో ఉంటే జరగని అభివృద్ధి.. బీజేపీలోకి వెళ్తే జరుగుతుందా అని ప్రశ్నించారు. మునుగోడు నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ నాయకులు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మునుగోడులో ఎప్పుడు ఎన్నిక లొచ్చిన కాంగ్రెస్‌నే గెలిపించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 12 స్థానాల్లో కాంగ్రెస్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పేదలపక్షపాతి అన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌పై మాజీమంత్రి దామోదర్ రెడ్డి ఫైర్ అయ్యారు. 1999కి ముందు కోమటిరెడ్డి బ్రదర్స్ ఎక్కడున్నారని నిలదీశారు. గతంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి పై ఎన్నోసార్లు నోరుపారేసుకున్నారని.. ఆయన చరిత్ర అంతా తనకు తెలుసన్నారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అమిత్ షా చుట్టూ ఎందుకు తిరుగుతున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్ పార్టీని వీడినంత మాత్రానా పార్టీకి ఎటువంటి నష్టంలేదన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ కు బ్రాండ్ ఏంలేదని..అంతా కాంగ్రెస్ బ్రాండేనని అన్నారు. కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీ మారనుండటంపై ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. చందూరులో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆమె రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరేందుకు సిద్ధమవడాన్ని తప్పుబట్టారు. ఆర్థిక ప్రయోజనాల కోసమే ఆయన బీజేపీలో చేరుతున్నారే తప్ప అభివృద్ధి కోసం కాదని విమర్శించారు. బీజేపీ కండువా కప్పుకుంటే నాయకుల అక్రమాలన్నీ సక్రమాలవుతాయా అని సీతక్క ప్రశ్నించారు. రాజకీయ కుట్రలో భాగంగానే గతంలో రేవంత్ రెడ్డిని జైలుకు పంపారని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్దతిలో ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చడం బీజేపీ నైజంగా మారిందని సీతక్క మండిపడ్డారు. తల్లి పాలకు తప్పితే మిగతా అన్నింటికీ పన్ను వేసిన ఘనత బీజేపీకే దక్కిందని విమర్శించారు. సంపాదించడానికి టీఆర్ఎస్.. దాన్ని కాపాడుకునేందుకు బీజేపీ అన్నట్లుగా పరిస్థితి మారిందని.. కాంగ్రెస్ పార్టీ మాత్రమే పేద ప్రజల కోసం పనిచేస్తోందని చెప్పారు. చందదూరు సభకు కాంగ్రెస్ పార్టీ భారీగా జనాలను తరలించింది. జానారెడ్డి తదితరులు కూడా ఈ సభలో మాట్లాడారు.

# తెలంగాణపై సీమాంధ్రుల కుట్రలు




(మొదటి పేజీ తరువాయి..)నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును కూడా కూల్చేందుకు వారు వెనుకాడబోరనిఅన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను కాపాడే దమ్ము కేవలం కేసీఆర్ కు మాత్రమే ఉందన్నారు. తెలంగాణ గడ్డ మనది. మన తెలంగాణను, మన ప్రభుత్వాన్ని మనమే కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు.వైయస్ షర్మిల, కేఏ పాల్ తెలంగాణకు ఎందుకు వస్తున్నారో వారికే తెలియాలి అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఢిల్లీ పార్టీలు టీఆర్ఎస్ మన ఇంటి పార్టీ వ్యాఖ్యానించారు. కరీంనగర్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రైతులు పండించిన వరి ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలుపై మరోసారి కేంద్ర ప్రభుత్వంతో పోరాటానికి సిద్ధమవుతున్నామన్నారు. సమస్యల పరిష్కారం కోసమే తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి సాధించుకున్నాం. కాళేశ్వరం జలాలను తీసుకొచ్చి ఉనికిని కోల్పోయిన చెరువులను బతికించామని మంత్రి తెలిపారు.తెలంగాణ ప్రజల ధైర్యంతోనే ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ రైతాంగం ధాన్యాన్ని పండిస్తే... ఆ ధాన్యాన్ని కొనుగోలు చేసే బాధ్యత కేంద్రానిది. మీ పాలిత రాష్ట్రాల్లో ఏం అభివృద్ధి చేశారని ఇక్కడ అధికారం కావాలని వస్తున్నారు అని ప్రశ్నించారు. అధికారం కోసం మతాల మధ్య ఘర్షణలు పెట్టిన ఘనత కాంగ్రెస్, బీజేపీ పార్టీలదని ఫైర్ అయ్యారు. తెలంగాణలో 60 శాతం మంది ప్రజలు కేసీఆర్ ప్రభుత్వం కావాలని కోరుకుంటున్నారు. పచ్చగా.. సుస్థిరంగా ఉన్న తెలంగాణపై కాంగ్రెస్, బీజేపీలు విషం చిమ్ముతున్నాయని మంత్రి ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి చెందుతుంటే మీకు ఎందుకు కల్లమంట... కడుపు మంట? అని మంత్రి కమలాకర్ ప్రశ్నించారు. తెలంగాణలోనే కరీంనగర్ ను తళతళలాడే నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. నూతన పాలకవర్గం రైతులకు అండగా ఉండాలి.. వారికి దెబ్బ తాకితే ఆ నొప్పి మీరు అనుభూతి చెందాలి అన్నారు. పదవి కోసం కాకుండా..పార్టీ కోసం జెండా పట్టుకున్న వారికే పదవులు లభిస్తాయని స్పష్టం చేశారు. కేంద్రం ఎన్ని ఇబ్బందులు పెట్టిన రైతులకు భారం కానివ్వం..కేంద్రంతో తాడోపేడో తెల్చుకుంటామని మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు.

# వచ్చే నాలుగేళ్లలో దేశంలో 100 ఎయిర్ పోర్ట్స్ నిర్మాణం

### ప్రవాస సమావేశంలో కిషన్ రెడ్డి వెల్లడి




హైదరాబాద్,ఆగస్ట్5(సమ సమాజం): వచ్చే నాలుగేళ్లలో దేశంలో 100 ఎయిర్ పోర్ట్స్ నిర్మిస్తామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. 2014 వరకు దేశంలో 64 ఎయిర్ పోర్ట్స్ ఉండగా మోడీ ప్రభుత్వం వచ్చాక 118కి చేరాయన్నారు. హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ లో జరిగిన ప్రవాస 3.0 సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ రవాణా వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందిందని.. దేశవ్యాప్తంగా అద్భుతమైన హైవేలను నిర్మించామని తెలిపారు. దేశ్యాప్తంగా 90 వేల నేషనల్ హైవేలను నిర్మించామని..70 వేల కొత్త రోడ్ల కనెక్టివిటీ కొనసాగుతోందన్నారు. పటిష్టమైన ప్రణాళికతో రోడ్లను నిర్మిచడం వల్లే దేశంలో ప్రమాదాలు తగ్గాయన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ట్రాన్స్‌పోర్ట్ అభివృద్ధికి కృషి చేస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. 370 ఆర్టికల్ రద్దుతో జమ్మూ కశ్మీర్‌లో రికార్డ్ స్థాయిలో టూరిస్ట్‌ల విజిటింగ్ పెరిగిందన్న ఆయన.. కేధార్‌నాథ్ కు వచ్చే టూరిస్టులు కూడా పెరుగుతున్నట్లు చెప్పారు. ఇక ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ ఇండస్ట్రీ సమస్యలపై కేంద్రమంత్రులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. టూరిజం శాఖలో రానున్న రోజుల్లో ఉద్యోగ అవకాశాలు పెంచుతామని చెప్పారు. టూరిజం అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం కృషి చేస్తోందని తెలిపారు.

# కాంగ్రెస్‌లో తెలంగాణ ఇంటి పార్టీ విలీనం

### మల్లిఖార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లోకి చెరుకు
### చెరుకు రాకపై తీవ్రంగా మండిపడ్డ వెంకట్ రెడ్డి
### రేవంత్ మొఖం చూసేది లేదని భీషణ ప్రతిజ్ఞ



న్యూఢిల్లీ, ఆగస్ట్ 5 (సమ సమాజం): తెలంగాణ ఇంటి పార్టీ కాంగ్రెస్ పార్టీలో విలీన మైంది. కాంగ్రెస్ సీని యర్ నేత, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ ఇంటి పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే చెరుకు సుధాకర్ చేరికను ఎంపికోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఇప్పటికే తమ్ముడితో కలిపి తనపై రేవంత్ విమర్శలు చేయడాన్ని తప్పుపట్టారు. ఈ క్రమంలో కాంగ్రెస్‌లో చెరుకు సుధాకర్ చేరికపై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పెద్దతప్పు చేశారని విమర్శించారు. తనను ఓడించాలనుకున్న వ్యక్తిని పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. ఇకపై రేవంత్‌రెడ్డి ముఖం చూడనని అన్నారు. పార్లమెంట్ సమావేశాల తర్వాతే మునుగోడుకు వెళ్తానని వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. మీడియా ప్రశ్నలపై ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. అలాగే వెంకట్‌రెడ్డి తీరుపై కూడా మీడియా ప్రతినిధులు మండిపడ్డారు. పనికిరాని మునుగోడు గురించి అడుగుతున్నారని బాధగా ఉందని వెంకట్‌రెడ్డి అన్నారు. వరద సాయం గురించి ఇప్పటివరకు ఎవరూ ప్రస్తావించలేదన్నారు. ప్రధాని, హోంమంత్రి అపాయింట్‌మెంట్ కూడా కోరానన్నారు. గుజరాత్ తర్వాత.. తెలంగాణాయే ధనిక రాష్ట్రమని సీఎం కేసీఆర్ చెప్పారని, ఇప్పుడు పెన్షన్లు కూడా ఇవ్వలేని పరిస్థితిలోకి పడిపోయిందని విమర్శించారు. రాష్ట్రం ఇలా ఉన్నప్పుడు.. సీఎం కేసీఆర్ వరద బాధితులకు ఇంకేం సాయం చేస్తారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి గురించి తాను మాట్లాడనని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు.

# బేకార్ బ్రాండ్ !



(మొదటి పేజీ తరువాయి..) హైదరాబాద్, ఆగస్ట్ 5 (సమ సమాజం): ఇన్నాళ్లు గుట్టుచప్పుడు కాకుండా కోట్లు కూడబెట్టుకున్నా, హవాలా ద్వారా ఇతర దేశాలకు పెట్టుబడులను పంపించినా ఎవ్వరు పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో అధికారం ఉంది కదా అని కండ్లు నెత్తికెక్కి, ఆదిపత్యంకోసం వ్యంపర్లాడటం వల్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత మొదలైంది. నల్లగొండలో ఎవరైనా నాయకుడు తయారవుతున్నారంటే చాలు వారిని తొక్కిపెట్టేందుకు విశ్వప్రయత్నాలు చేస్తారు. ఇందులో భాగంగానే తెలంగాణ ఉద్యమకారుడు చెరుకు సుధాకర్ కాంగ్రెస్‌లో చేరటంతో తట్టుకోలేని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నన్ను కాదని ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసిని ఎలా పార్టీలో చేర్చుకుంటారు అని ఫైరెయ్యారు.

### మొదటి నుంచి బహుజనులంటే చిన్నచూపే...

కోట్లకు కోట్లు కాంట్రాక్టుల పేరుతో ప్రజల సొమ్ము దోచుకొని అందులోంచి కొంత మొత్తాన్ని ప్రజలకు సంఘసేవ చేస్తున్నట్లుగా కలరింగ్ ఇస్తూ, సానుభూతి పొందుతుంటారని, మరి కొందరినైతే కోమటిరెడ్డి బ్రదర్స్ అంటే మంత్రముగ్ధులవుతారని, కోమటిరెడ్డి బ్రదర్స్ చేసే ఎలాంటి పనైనా కరెక్టే అన్నట్లు భ్రమలో బతికేస్తారు. గల కారణం బడుగు బలహీన వర్గాల వీక్‌నెస్ పై దెబ్బకొట్టే ప్రయత్నం. ఎవరికి ఏఏ అవసరాలు ఉంటాయి. వారిని ఎలా ప్రలోభపెట్టాలి !, అనేది తన అనుచరుల ద్వారా కనుక్కొని వారికి గాలం వేస్తుంటారు. ఈ రకంగా వారి రాజకీయ స్వార్థం కోసం ఎంతవరకైనా తెగిస్తాసూ, లోబర్చుకుంటారు అని వారి అనుచరులు చెప్పుకుంటుంటారు.

### రాష్ట్రంలో మేము పెద్ద పుడింగులం అనే ఫీలింగ్ ...

కేసీఆర్ కుటుంబ పాలనను అంతం చేసేందుకే నా రాజీనామా అని తమ్ముడు. 34 ఇండస్ట్రీ అని ఊదరకొడుతాడు తన అన్న. ఏది ఏమైనా అంతిమంగా కాంగ్రెస్ పార్టీని తునా తునకలు చేసేవిధంగా రెచ్చగొట్టి చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తూ పోతున్నారు. సొంత పార్టీ నాయకులను ద్వేషిస్తూ, జేలుకు పొయ్యొచ్చిన వాడు చెప్పితే మేము వినాలనా. అంటూ అహంకారం వెళ్లగక్కుతున్నారు. సోనియా అంటే ప్రేమ అని అంటూనే సోనియా నియమించిన టీపీసీసీ రేవంత్ అంటే విరక్తి చెందుతున్నరు. జేలుకు పోయి వచ్చిన రేవంత్ రెడ్డి అంటే గిట్టనప్పుడు, అమిత్‌షా కూడా జేలుకు పొయ్యి వచ్చిన వాడే కదా !. కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా మోచేతి నీళ్లు ఎందుకు తాగడానికి పోతున్నవు అని ప్రజలు విమర్శిస్తున్నారు. రేవంత్ నీ దృష్టిలో నేరస్తుడు అయితే అమిత్‌షా కూడా నేరస్తుడే అని చెప్పకనే చెబుతున్నారు.

### కుట్రలను పసిగట్టిన కాంగ్రెస్ కార్యకర్తలు, మునుగోడు ప్రజలు ...

కోమటిరెడ్డి బ్రదర్స్ ఢిల్లీలో చేస్తున్న లాబింగ్‌లను మునుగోడు ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. సోనియా గాంధీ ఈడీ కేసులలో వేదింపులకు గురౌతుందని, కోమటిరెడ్డి సోదరులు అమిత్‌షాతో సంప్రదింపులు చేస్తున్నారని వీరి దుర్మార్గపు ఆలోచనను తిప్పికొట్టాలని మునుగోడు నియోజకవర్గ ప్రజలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. రాబోయే ఉప ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పేందుకు మునుగోడు ప్రజలు సిద్ధమైనట్లు, అవసరమైతే టీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసేందుకు సిద్ధమౌతున్నారని, ఉపఎన్నికలలో రాజగోపాల్‌రెడ్డి ఓటమిపాలవ్వడానికి బీజేపీకి అస్సలు ఓటు వేసే ప్రసక్తే లేదు అని అనుకుంటున్నారు. ఒకప్పుడు కోమటిరెడ్డి బ్రదర్స్ అంటే కోమటిరెడ్డి బ్రాండ్‌గా ఉండేదని, కొంతకాలంగా వ్యక్తిగత స్వార్థం, కాంట్రాక్టుల కోసమే కోమటిరెడ్డి బ్రదర్స్ బీజేపీ వైపు మొగ్గి చూస్తుండటంతో మునుగోడు నియోజకవర్గ ప్రజలు కోమటిరెడ్డి బ్రదర్స్‌పై తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

# హుజూరాబాద్‌లో వేడెక్కిన రాజకీయం

**సవాళ్లు విసిరి వేదిక వద్దకు వచ్చిన కౌశిక్ రెడ్డి**

**పోటాపోటీగా ఫ్లెక్సీల ఏర్పాట్లు చేసిన టీఆర్ఎస్, బిజెపి**

**కౌశిక్ రెడ్డికి అంత సీన్ లేదంటూ బిజెపి నేతలు ఎదురుదాడి**

**ఉద్రిక్త పరిస్థితులు మధ్య ఇరు పార్టీల్లో పలువురు నేతల అరెస్ట్**

కరీంనగర్,ఆగస్ట్5(ఆర్ఎన్ఎ): హుజురాబాద్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమని ప్రకటించి.. వేదిక వద్దకు వెళుతున్న బీజేపీ నేతలను అరెస్టు చేయడంపై ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని అరెస్టు చేసి వీణవంక పోలీస్ స్టేషన్ కు తరలించారు. అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా బీజేపీ నేతలు ఆందోళనలు నిర్వహించారు. కౌశిక్ రెడ్డి, టీఆర్ఎస్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. కౌశిక్ దిష్టిబొమ్మను బిజెపి నేతలు దగ్ధం చేశారు. బీజేపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో వారి మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఇదిలా ఉంటే.. కౌశిక్ రెడ్డి సవాళ్లపై బీజేపీ నేతలు స్పందించారు. మానుకొండలో తెలంగాణ ఉద్యమకారులపై రాళ్లు వేసిన కౌశిక్ రెడ్డితో చర్చకు ఈటలరారని.... హుజురాబాద్ అభివృద్ధిపై మాట్లాడేందుకు తామే వస్తామని నియోజకవర్గ బీజేపీ నేతలు కౌంటర్ ఇచ్చారు. అన్నట్లుగానే సభా వేదిక వద్దకు భారీ ర్యాలీతో కౌశిక్ రెడ్డి చేరుకున్నారు. ఆయన ప్రసంగం ముగిసే సమయానికి కొంతమంది బీజేపీ కార్యకర్తలు చేరుకున్నారు. చౌక్ దగ్గర భారీగా పోలీసులు కూడా మోహరించారు. అప్పటికే భారీ సంఖ్యలో వచ్చిన టీఆర్ఎస్ నేతలు వారిని అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య తోపులాట చోటు చేసుకోవడంతో పరిస్థితి కొంత ఉద్రిక్తతంగా మారింది. వీరిని మరోసారి పోలీసులు చెదరగొట్టారు. మొత్తంగా బహిరంగసభ చర్చతో హుజురాబాద్ హీటెక్కింది. దీంతో హుజురాబాద్‌లో బీజేపీ నేతలను పోలీసులు అరెస్టు చేసారు. జమ్మికుంట, హుజురాబాద్‌లో అరెస్టులు కొనసాగుతున్నాయి. జిల్లా బీజేపీ అధ్యక్షుడు కృష్ణారెడ్డిని కూడా అరెస్ట్ చేశారు. ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి హుజురాబాద్ అభివృద్ధిపై బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌కు సవాల్ చేసిన విషయం తెలిసిందే. వేదిక మీద టీఆర్ఎస్ నేతలు రెండు కుర్చీలు వేశారు. చౌక్ దగ్గరకు భారీగా టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను కౌశిక్ రెడ్డి తరలించారు. బీజేపీ నేతలు, కార్యకర్తలను మాత్రం పోలీసులు అరెస్టు చేసారు. హుజూరాబాద్ నియోజకవర్గం సవాళ్లు, ప్రతి సవాళ్లతో హోరెత్తుతోంది. ఈటెలకు దమ్ముా, ధైర్యం ఉంటే చర్చకు రావాలన్నారు. ఆయన హుజురాబాద్‌లో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. చర్చకు రమ్మంటే అల్లర్లు అని మాట్లాడుతున్నారని కౌశిక్ రెడ్డి విమర్శించారు. దీనికి ప్రతిగా బీజేపీ నాయకులు ప్రెస్‌మీట్లు పెట్టి తమ వాదన వినిపించారు. ఈ అంశంపై జెండాలు, ఫ్లెక్సీలు ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా ఏర్పాటు చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గం సవాళ్లు, ప్రతి సవాళ్లతో హోరెత్తుతోంది. చర్చకు ఒకరోజు ముందే టీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు బలాబలాలు ప్రదర్శించుకుంటూ కర్రలతో ఘర్షణకు దిగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. హుజూరాబాద్‌లో అభివృద్ధిపై చర్చకు రండి అంటూ ఈటలకు సవాల్ విసురుతున్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీని ప్రతిగా బీజేపీ నాయకులు కూడా కౌశిక్ రెడ్డిని ప్రశ్నిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈటల పుణ్యంతోనే ఎమ్మెల్సీ పదవి అనుభవిస్తున్న కౌశిక్‌రెడ్డికి ఈటలతో బహిరంగ చర్చకు అర్హత లేదని, ఆయన రాజకీయ అనుభవమంత వయస్సు కూడా కౌశిక్ రెడ్డికి లేదని పేర్కొంటూ మీతో చర్చించేందుకు మేము సిద్ధం, మేం సరిపోతాం అంటూ కార్యకర్తలు పలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

# తెలంగాణ కాంగ్రెస్‌కు మరో ఢక్కా

**పార్టీకి రాజీనామా చేసిన అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్**

**రేవంత్ పార్టీని సొంత ప్రాపర్టీలో నడుపుతున్నారు**

**తెలంగాణ కాంగ్రెస్‌లో అరాచక పరిస్థితులు**

**సోనియా, రాహుల్ ఆశయాలకు భిన్నంగా రేవంత్ ధోరణి**

**రేవంత్ చర్యలను ప్రశ్నించే వారు లేకుండా కుట్రలు**

**మాఫియా తరహా రాజకీయాలు చేస్తున్నారు**

**అందుకే పార్టీని వీడుతున్నానని వెల్లడించిన శ్రవణ్**

**సీనియర్ల బుజ్జగింపులకు లొంగని దాసోజు**



**హైదరాబాద్, ఆగస్ట్ 5 (సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీ నుంచి మరో బిగ్ వికెట్ పడిపోయింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మరో షాక్. కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నట్లు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రకటించి రెండు రోజులు గడవకముందే పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా మీడియా సమావేశంలో వెల్లడించారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ కాంగ్రెస్‌లో అరాచక పరిస్థితులు నెలకొన్నాయని, బానిస బతుకు బతకడం ఇష్టంలేకే పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు దాసోజు శ్రవణ్ వెల్లడించారు. ఈమేరకు మీడియాతో ఆయన మాట్లాడారు. సోనియా తెలంగాణ ఇచ్చారనే కృతజ్ఞతతో.. రాహుల్‌గాంధీ 2013లో జరిగిన జైపూర్ చింతన్ శిబిర్‌లో రాహుల్ ప్రసంగం విని ఉత్తేజితుడై 2014లో కాంగ్రెస్ పార్టీలో చేరా. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడు అయిన తర్వాత.. కాంగ్రెస్ పార్టీలో కులం, ధనం చూసి ప్రాధాన్యత ఇస్తున్నారు. రేవంత్ నాయకత్వంలో అరాచక పరిస్థితులు నన్ను కలచివేశాయని తెలిపారు.తెలంగాణ కాంగ్రెస్‌లో మాఫియా తరహా రాజకీయాలు చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి పార్టీ కోసం పనిచేస్తున్నట్లు కనిపించడం లేదు. ఇంతవరకు పార్టీ తరఫున సమీక్షలు గానీ, కమిటీలు గానీ పెట్టడం లేదు. పార్టీ అధికారంలోకి వస్తుందని ఏళ్లనుంచి ఎదురుచూస్తున్నాం. కాంగ్రెస్ కోసం పాటుపడిన మమ్మల్నే బలహీనపరుస్తున్నారు. పార్టీలోకి చేరింది బానిసగా బతకడానికి కాదు. ఎన్నో రోజులుగా బాధలు తట్టుకుంటూ వచ్చాను. కాంగ్రెస్‌ను రేవంత్‌రెడ్డి ప్రైవేట్ పాపర్టీగా మార్చుతున్నారు. అందుకే కాంగ్రెస్ సభ్యత్వానికి... అన్ని రకాల పదవులకు రాజీనామా చేస్తున్నానని దాసోజు శ్రవణ్ ప్రకటించారు. గత కొంతకాలంగా పీసీసీ వైఖరి పట్ల శ్రవణ్ అసంతృప్తిగా ఉన్నారు. పీజేఆర్ కుమార్తె విజయరెడ్డి కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి ఆయన అలిగినట్లు పార్టీ వర్గాల సమాచారం. శ్రవణ్ కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్లు తెలియగానే ఆ పార్టీ నేతలు కోదండరెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్ కలిసి దాసోజు ఇంటికి చేరుకున్నారు. పార్టీ నుంచి వెళ్లిపోవద్దంటూ బుజ్జగించారు. అయినా ఫలితం దక్కలేదు. తను తీసుకున్న నిర్ణయం మేరకు ఏఐసీసీ అధికార ప్రతినిధి పదవికి,కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు దాసోజు శ్రవణ్ ప్రకటించారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని అది చూసి తట్టుకోలేకనే పార్టీని వీడుతున్నట్టు తెలిపారు. రేవంత్ రెడ్డి అగ్రకుల దురహంకారంతో వ్యవహరిస్తు న్నారని.. కాంగ్రెస్‌ను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. హస్తం పార్టీలో అరాచక పరిస్థితులు కొనసాగుతున్నాయని అన్నారు. అలాగే కాంగ్రెస్‌ను ఫ్రాంచైజీగా నడుపుతున్నారని మండిపడ్డారు. తనకు తిరుగు లేదన్న రీతిలో యాన వ్యవహార శైలి ఉందన్నారు. రేవంత్ పీసీసీ చీఫ్ అయ్యాక కాంగ్రెస్‌లో కులం, ధనం అన్నట్టుగా మారిపోయిందన్నారు. ప్రశ్నించే వాళ్లను సర్వేల పేరుతో తప్పుడు నివేదికలు ఇస్తూ..సొంత పార్టీ నాయకులను బలహీనపరుస్తున్నారు. అలాంటి వ్యక్తి నేతృత్వంలో ఇక పనిచేయడం కదురదని గుర్తించే బయటకు వస్తున్నామని అన్నారు. రాహుల్ ఆలోచనకు వ్యతిరేకంగా రేవంత్ కాంగ్రెస్‌ను భ్రష్టు పట్టిస్తు న్నాడని దాసోజు శ్రవణ్ ఆరోపించారు. రేవంత్ 24 గంటలు బిజీ అని... ఎవరికీ అందుబాటులో ఉండర న్నారు. పీసీసీ చీఫ్ అగ్రకుల అహంకారంతో వ్యవహరిస్తున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ బాధ చెప్పుకునేందుకు పార్టీలో అవకాశం లేదన్నారు. మాణిక్కం ఠాగూర్, రేవంత్, సునీల్ కనుగోలు ముగ్గురూ కుమ్మక్కయ్యారన్నారు. రేవంత్ తప్పులు చేస్తుంటే ఠాగూర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మాఫియాను నడిపినట్టు పార్టీ నడుపుతున్నారని ధ్వజమెత్తారు. ఏఐసీసీ నుండి పార్టీని రేవంత్ లీజ్ కు తీసుకున్నట్లుగా ఉందన్నారు. రేవంత్ కాంగ్రెస్ పార్టీలో తన సొంత ముఠాను ప్రోత్స హిస్తున్నరని దాసోజు శ్రవణ్ తీవ్రంగా ఆరోపించారు. ఆయన వ్యక్తిగత ఇమేజ్ పెంచుకునేందుకు పార్టీని బలహీన పరుస్తున్నారన్నారు. పార్టీలో ఎవరినీ లెక్క చేయకుండా నిరంకుశంతో వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఏఐసీసీ నుంచి ఫ్రాంచైజీ తెచ్చు కున్నట్టు రేవంత్ వ్యవహరిస్తున్నరని తెలిపారు. రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ ను భ్రష్టుపట్టిస్తున్నారని.. వసూళ్ల పర్వం కోసం రాజకీయాన్ని హస్తగతం చేసుకున్న ట్టుగా ఉందన్నారు. ఏడాదిలో ఎన్నికలు వస్తున్నా జిల్లాల్లో కమిటీలు వేయలేదని..దళిత దండోరా, నిరుద్యోగ నగారా ఏమైందో ఎవరికీ తెలీదన్నారు. టీఆర్ఎస్ కు ప్రత్యామ్నంగా కాంగ్రెస్ ఎదగలేక పార్టీ రోజురోజుకు దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు సేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చానని..పేదోళ్ల గొంతుకగా ఉండాలని ఇన్నాళ్లు కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ వచ్చానని శ్రవణ్ చెప్పారు. జైపూర్ సభలో రాహుల్ ప్రసంగం విని ఆకర్షితుడినై కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యానని తెలిపారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా పార్టీ కోసం అహర్నిశలు పనిచేశానని చెప్పారు. కానీ పార్టీ సిద్ధాంతాలకు రేవంత్ వ్యవహరిస్తుం డటంతో తాను చాలా విసిగిపోయాననని...ఏడాది కాలంగా ఎన్నో నిద్రలేని రాత్రిళ్లు గడిపానని చెప్పారు. తెలంగాణను కేసీఆర్ కబంద హస్తాల నుంచి విముక్తి చేసేందుకు మలిదశ పోరాటం చేస్తానని చెప్పారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బాటలో ఏఐసీసీ అధికార ప్రతినిధిగా ఉన్న దాసోజు శ్రవణ్ కూడా పార్టీ వీడేందుకు సిద్ధమయ్యారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యవహారంపై శ్రవణ్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శ్రవణ్ కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్లు తెలియగానే ఆ పార్టీ నేతలు కోదండరెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ కలిసి దాసోజు ఇంటికి చేరుకుని బుజ్జగించారు.

# బడా వ్యాపారావేత్తల ప్రయోజనాలే వారి లక్ష్యం




(మొదటి పేజీ తరువాయి..)దేశంలో ప్రజాస్వామ్యం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలపై గళం ఎత్తితే ప్రభుత్వం అణిచివేస్తోందని ఆరోపించారు. శుక్రవారం దిల్లీలో ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించి రాహుల్.. భాజపాపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 'ప్రజాస్వామ్యం మరణాన్ని మనం చూస్తున్నాం. శతాబ్దకాలంపాటు ఇటుక ఇటుక పోగేసి నిర్మించిన భారత దేశం మన కళ్ల ముందే ధ్వంసమైపోతోంది. నియంతృత్వానికి ఎదురు నిలిచినవారిపై దాడులు చేస్తున్నారు, జైల్లో వేస్తున్నారు, అరెస్ట్ చేస్తున్నారు, కొడుతున్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, హింస.. ఇలా ప్రజాసమస్యలేవీ ప్రస్తావించరాదన్నదే వారి ఆలోచన. నలుగురు, ఐదుగురు ప్రయోజనాల కోసమే ఈ ప్రభుత్వం పనిచేస్తోంది. ఇద్దరు, ముగ్గురు బడా వ్యాపారవేత్తల ప్రయోజనాల కోసం ఇద్దరు వ్యక్తులు నియంత పాలన సాగిస్తున్నారు.' అని మండిపడ్డారు రాహుల్ గాంధీ.నేషనల్ హెరాల్డ్? కేసులో కాంగ్రెస్ అగ్రనేతల్ని విచారించడంపై స్పందించారు. తమను ఎంతైనా ప్రశ్నించుకోవచ్చని అన్నారు. అసలు అక్కడ(హెరాల్డ్ కేసులో) ఏమీ లేదన్న విషయం అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని వ్యతిరేకించడమే తన పని అని.. అందుకు ప్రతిగా తనపై దాడి చేసినా ఏమాత్రం తగ్గబోనని స్పష్టం చేశారు. 'వారు గాంధీ కుటుంబంపై ఎందుకు దాడి చేస్తారు? ఎందుకంటే.. మేము ఒక సిద్ధాంతం కోసం పోరాడతాం కాబట్టి. మాలాంటి వారు కోట్ల మంది ఉన్నారు. మేము ప్రజాస్వామ్యం కోసం, సమాజంలో సామరస్యం కోసం పోరాడతాం. ఎన్నో ఏళ్లుగా ఇలానే చేస్తున్నాం. మా కుటుంబం ప్రాణత్యాగాలు చేసింది. ఈ సిద్ధాంతం కోసం పోరాడేటప్పుడు అది మా బాధ్యత కూడా. రెండు వర్గాల మధ్య గొడవలు పెడుతుంటే, దళితుల్ని చంపేస్తుంటే, మహిళల్ని కొడుతుంటే చాలా బాధ కలుగుతుంది. అందుకే మేము పోరాడతాం. ఇది ఒక కుటుంబం కాదు.. ఒక సిద్ధాంతం' అని అన్నారు రాహుల్ గాంధీ.నిరుద్యోగం, ధరల పెరుగుదల విషయమై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్?పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు కాంగ్రెస్ అగ్రనేత. దేశ ఆర్థిక రంగంలో అసలు ఏం జరుగుతుందో ఆమెకు తెలియడం లేదని ఎద్దేవా చేశారు. ఆమె రాజకీయ పార్టీకి అధికార ప్రతినిధిగా మాత్రమే ఉన్నారని విమర్శించారు. ఎన్నికల్లో భాజపా వరుస విజయాలపైనా తనదైన శైలిలో స్పందించారు. రాహుల్. 'హిట్లర్ కూడా ఎన్నికల్లో గెలిచేవాడు. ఎలా గెలిచాడు జర్మనీలోని వ్యవస్థలన్నీ అతడి నియంత్రణ లోనే ఉండేవి. నాకు వ్యవస్థ మొత్తాన్ని అప్పగించండి. ఎన్నికలు ఎలా గెలవాలో నేను చూపిస్తా' అని అన్నారు కాంగ్రెస్ అగ్రనేత. ఇదిలావుంటే గాంధీ అంటే ఓ కుటుంబం కాదు, సిద్ధాంతం' అన్న రాహుల్ వ్యాఖ్యలపై భాజపా తీవ్రంగా స్పందించింది . రాహుల్ మహాత్మా గాంధీ వారసుడేమీ కాదు. ఆయన 'నకిలీ' గాంధీ. వారిది నకిలీ సిద్ధాంతం' అని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి విమర్శించారు. మరోవైపు.. ధరల పెరుగుదల, నిరుద్యోగంపై కాంగ్రెస్ నిరసనల నేపథ్యంలో దిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. విజయ్ చౌక్ వద్ద భారీగా పోలీసుల్ని మోహరించారు. జంతర్ మంతర్ మినహా న్యూదిల్లీలోని ఇతర అన్ని ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు.

# అన్నా వెంకన్నా..నేను తిట్టింది తమ్ముడినే

**రాజఘోపాలరెడ్డి వెన్నుపోటు పొడిచాడన్నది నిజమే కదా**

**నువు మా పెద్దన్నవు..అపోహలతో మనసు పాడుచేసుకోవద్దు**

**నీకూ నాకూ మధ్య అగాధం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు**

**మీడియాతో వివరణ ఇచ్చుకున్న పిసిసి చీఫ్ రేవంత్**

**రాజగోపాల్‌లో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్**




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 5 (సమ సమాజం):** కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీ ద్రోహి అని, వ్యాపారాల కోసమే కాంగ్రెస్ పార్టీ మారాడని టీ.పీసీసీ చీఫ్ రెవంత్ రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీతోనే ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ లేకుంటే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బ్రాందీ షాప్‌లో కూడా పని చేయడానికి పనికిరాడంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే తాను చేసిన వ్యాఖ్యలు కేవలం రాజగోపాల్‌రెడ్డిపైనే తప్ప మరోటి కాదన్నారు. తాను ఎప్పుడూ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గౌరవాన్ని తగ్గించేలా మాట్లాడలేదన్నారు. తాను కేవలం రాజగోపాల్ రెడ్డి గురించి మాత్రమే మాట్లాడానని చెప్పారు. రాజగోపాల్ రెడ్డి విసిరిన బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. చండూరు చౌరస్తాలో నిర్వహించే బహిరంగ చర్చకు తాను హాజరవు తున్నానని, చర్చకు కూడా సిద్ధంగా ఉన్నానని చెప్పారు. గత ఎనిమిది సంవత్సరాల్లో కేసీఆర్ ప్రభుత్వంపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పోరాడలేదన్నారు. తనమీద రాష్ట్ర ప్రభుత్వం 80కి పైగా కేసులు పెట్టిందని తెలిపారు. రాజగోపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేసి ఉంటే ఎన్ని కేసులు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్థిక ప్రయోజనాల కోసమే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీ మారాడని ఆరోపించారు. మీరు వెన్నుపోటు పొడుస్తున్నారని కోమటిరెడ్డి బ్రదర్స్‌ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వివరణ ఇచ్చారు. వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కుటుంబసభ్యుడని.. తాను రాజగోపాల్‌రెడ్డిని ఉద్దేశించి మాత్రమే మాట్లాడినట్లు చెప్పారు. తనకు, వెంకట్‌రెడ్డికి మధ్య కొందరు అగాధం సృష్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. అపోహలతో వెంకన్న మనస్తాపం చెందాల్సిన అవసరం లేదని రేవంత్ అన్నారు. రాజగోపాల్‌రెడ్డిని సొంత పార్టీని ముంచేందుకు యత్నించిన ద్రోహిగా అభివర్ణించిన రేవంత్‌రెడ్డి.. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎప్పటికీ తమ నాయకుడేనని స్పష్టం చేశారు. రాజగోపాల్‌రెడ్డి చేసిన పోరాటాలు, కాంట్రాక్టుల గురించి తేల్చేందుకే చండూరుకు వస్తున్నామన్న రేవంత్..... నిజాయితీపరుడైతే తమతో చర్చకు రావాలని సవాల్ విసిరారు. 'కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వేరు.. రాజగోపాల్‌రెడ్డి వేరు. రాజగోపాల్‌రెడ్డి సొంత పార్టీకి ద్రోహం చేశాడు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మా కుటుంబసభ్యుడు. నా కంటే సీనియర్ నేత.. తెలంగాణ ఉద్యమంలో ఆయనది కీలక పాత్ర. రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ ద్రోహి. నా వ్యాఖ్యలకు వెంకట్‌రెడ్డికి ఎలాంటి సంబంధంలేదు. రాజగోపాల్‌రెడ్డిని మాత్రమే మీరు అని సంబోధించాను. నాకు, వెంకట్‌రెడ్డికి మధ్య కొందరు అగాధం సృష్టిస్తున్నారు. అపోహలతో మా వెంకన్న మనస్తాపం చెందాల్సిన అవసరంలేదు. రాజగోపాల్‌రెడ్డి సవాళ్లకు ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధం. టెండర్లు, కేసీఆర్‌పై పోరాటంపై చండూరుకు వచ్చి మాట్లాడుతా.' అని రాజ్‌గోపాల్ రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. బీజేపీ పార్టీ కాంట్రాక్టులు ఇచ్చి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. భద్రాచలం ముంపునకు ప్రధాని నరేంద్ర మోడీ, ఆయన మంత్రివర్గమే కారణమని ఆరోపించారు. తెలంగాణకు కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఎన్నో ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించిందని చెప్పారు. తెలంగాణకు బీజేపీ ద్రోహం చేసిందన్నారు. బీజేపీ పార్టీ చాలామంది నేతలకు కాంట్రాక్టులు, కమీషన్లు ఆశచూపి ప్రలోభాలు పెడుతోందని ఆరోపించారు. చెరుకు సుధాకర్ కాంగ్రెస్ పార్టీలో చేరడం వల్ల తెలంగాణ ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. బీజేపీ, టీఆర్ఎస్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందన్నారు. కాంగ్రెస్ మునుగోడు సభలో చెరుకు సుధాకర్ పాల్గొంటారని చెప్పారు. కాంగ్రెస్ తీసుకునే నిర్ణయాలను తెలంగాణ ప్రజలు కూడా స్వాగతించాలని కోరారు. సోనియా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ కోసం కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బలంగా పని చేస్తున్నారని చెప్పారు. తాను పార్టీ మారుతున్నానంటూ ప్రచారం చేసే వారికి లీగల్ నోటీసులు ఇస్తానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. కోమటిరెడ్డి బ్రాండ్ లేదనడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో 35 ఏళ్లుగా పని చేస్తున్నానని, తెలంగాణ కోసం మంత్రి పదవికి రాజీనామా చేశానని వెంకట్‌రెడ్డి తెలిపారు. తాను నాలుగు పార్టీలు మారి రాలేదన్నారు. రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని ఇంతకుముందే కోరానని చెప్పారు. సోనియా గాంధీ తనను పీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్‌గా నియమించారని తెలిపారు. ఈ విషయంపైనే తాజాగా రేవంత్ స్పందించారు.

# కాంగ్రెస్ ఖాళీ కావడం ఖాయం

**టిఆర్ఎస్ నుంచి కూడా భారీగా చేరికలు**

**21న అమిత్ షా సమక్షంలో రాజగోపాలు, దాసోజుల చేరిక**

**మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ వెల్లడి**



**హైదరాబాద్,ఆగస్ట్5(సమ సమాజం):** ఈనెల 21న మునుగోడు సభలో రాజగోపాల్ రెడ్డి, దాసోజు శ్రవణ్ సహా పలువురు నాయకులు బీజేపీలో చేరతారని బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలిపారు. సిద్దిపేట మురళీయాదవ్, రాజయ్య యాదవ్, ఎర్రబెల్లి ప్రదీప్ రావులు కాషాయ కండువా కప్పుకుంటారని చెప్పారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కనుమరుగవుతోందని.. త్వరలోనే టీఆర్ఎస్ కూడా ఖాళీ అవుతుందని విమర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు సీఎం కేసీఆర్ ఇనుప కంచె వేశాడని ఆరోపించారు. పెన్షన్ కూడా ఇప్పించలేని పరిస్థితుల్లో రాష్ట్ర మంత్రులు ఉన్నారన్నారు. హుజురాబాద్‌లో ఓ టీఆర్ఎస్ నాయకుడు చిల్లర వేషాలు వేస్తున్నాడని.. ప్రజలే అతడికి తగిన బుద్ధి చెప్తారని మండిపడ్డారు. గురుకులాలతో పాటు కస్తూర్బ బాలిక విద్యాలయాలు సహా బాసర ట్రిపుల్ ఐటీలో నాణ్యమైన ఫుడ్ పెట్టడం లేదని ఈటల ఆరోపించారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అనే వార్తలు ఎప్పుడు వినాల్సి వస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కేసీఆర్ మనవడు తిన్న ఫుడ్ గురుకులాల్లో పెడుతున్నామని చెప్తున్నారని..కేసీఆర్ మనవడిని కొన్ని రోజులు గురుకులాలకు పంపాలని అన్నారు. గురుకులాల్లో పెట్టే ఫుడ్ తో బావితరాలు ఎలా ఆరోగ్యంగా ఉంటారని ప్రశ్నించారు. గురుకులాల టీచర్లతో కేసీఆర్ వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఈటల ఆరోపించారు. గురుకులాలు, బాసర ట్రిపుల్ ఐటీకి వెళదామంటే పోలీసులు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని. అయినా కేసీఆర్ ప్రభుత్వంలో చలనం లేదని విమర్శించారు .




# చలన చిత్రం

## కంటతడి పెట్టిన అక్షయ్ కుమార్

బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ బుల్లితెరపై ప్రసారమయ్యే సూపర్‌స్టార్ సింగర్ రెండో సీజన్‌లోని ఓ ఎపిసోడ్‌కు ప్రత్యేక అతిథిగా వెళ్లాడు. దీనికి సంబంధించిన ప్రోమోను సదరు ఛానల్ రిలీజ్ చేయగా ఇందులో అక్షయ్ కంటతడి పెట్టుకుంటూ కనిపించాడు. రక్షా బంధన్ స్పెషల్ ఎపిసోడ్‌లో అందరూ అన్నాచెలలెలి అనుబంధాన్ని గుర్తుచేసే పాటలే పాడారు. ఈ క్రమంలో అక్షయ్ తన సోదరితో కలిసి రాఖీ పండగ జరుపుకున్న ఫొటోలను సైతం స్క్రీన్‌పై ప్లే చేశారు. తన కష్ట సమయాల్లో అక్షయ్ అండగా నిలబడ్డాడని, కేవలం అన్నగానే కాకుండా ఓ తండ్రిగా, స్నేహితుడిగా సపోర్ట్‌నిచ్చాడంటూ తన అన్నను ఆకాశానికెత్తింది అతడి సోదరి. ఇది చూసిన అక్షయ్.. చె÷-లలెలు దేవి వచ్చాక మా జీవితాల్లో ఎంతో మార్పు వచ్చిందని, మా బంధం అత్యంత విలువైనదని చెప్తూ ఎమోషనలయ్యాడు.



## రి ఎంట్రీకి సిద్ధంగా ఉన్న కాజల్

హీరోయిన్ కాజల్ అగర్వాల్ ప్రస్తుతం మదర్‌వుడ్‌ని ఆస్వాదిస్తుంది. పెళ్లి తర్వాత కూడా సినిమాలు కంటిన్యూ చేసిన ఈ ముద్దుగుమ్మ ప్రెగ్నెన్సీ కారణంగా సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. దీంతో కాజల్ మళ్లీ సినీ కెరీర్‌ను కంటిన్యూ చేస్తుందా లేదా అన్న సందేహాలు తలెత్తాయి. అయితే తాజాగా నేహా ధూపియాతో ఇన్‌స్టా లైవ్‌లో ముచ్చటించిన కాజల్ రీఎంట్రీపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారతీయుడు-2 సినిమాతో త్వరలోనే సిల్వర్ స్క్రీన్‌పై మెరవనుంది. కమల్‌హాసన్ హీరోగా నటిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ సెట్‌లో ప్రమాదం జరగడంతో సినిమాను తాత్కాలికంగా వాయిదా వేసిన సంగతి తెలిసిందే. తర్వాత కోవిడ్, ఇతరాత్ర కారణాల వల్ల వాయిదాలు పడుతూ వచ్చిన ఈ సినిమా త్వరలోనే రీస్టార్ట్ కానుంది. ప్రసవం తర్వాత కాజల్ నటిస్తున్న తొలి ప్రాజెక్ట్ ఇదే. ఇప్పటికే 60 శాతం షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. సెప్టెంబర్ 13 నుంచి ఈ సినిమా షూటింగ్ పునఃప్రారంభం కానుంది.





## చిరంజీవి అంటే మక్కువంటున్న అనుపమ

ఆయనతో నటించాలని ఉందన్న కేరళకుట్టి

కేరళ కుట్టి అనుపమ పరమేశ్వరన్‌కి టాలీవుడ్ లెజండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి అంటే మహా ఇష్టం అని చెప్పింది. మాటల మాంత్రీకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కించిన 'అ..ఆ' చిత్రం ద్వారా టాలీవుడ్ కి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన అనుపమ ఇందులో చేసిన నాగవల్లి పాత్రతో మంచి పేరు తెచ్చుకుంది. దాంతో ఇక్కడ వరుసగా సినిమాలు చేసే అవకాశం అందుకుంది. ఈ క్రమంలోనే మాట్లాడుతూ.. 'టాలీవుడ్ లో నాకు ఎంతో ఇష్టమైన నటుడు మెగాస్టార్ చిరంజీవి. ఆయన సినిమాలు నాకు చాలా ఇష్టం. అటువంటి టాప్ స్టార్ తో కలిసి మూవీలో నటించే ఛాన్స్ వస్తే వెంటనే ఒకే అనేస్తాను' అని అనుపమ తెలిపింది. మరి అనుపమ మాటలు విని మెగాస్టార్ తన సినిమాలో అవకాశం కలిపిస్తారేమో చూడాలి. మధ్యలో కాస్త గ్యాప్ వచ్చినా మళ్ళీ ఇప్పుడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉంది.అనుపమ ప్రస్తుతం నిఖిల్ సరసన హీరోయిన్‌గా నటించిన కార్తికేయ 2 చిత్రం ఈనెల 13న భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది. చందు మొండేటిదర్శకుడు. ఈ నేపథ్యంలో చిత్ర బృందం జోరుగా ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వీరిలో అనుపమ కూడా ఉంది. ఈ సందర్భంగా తాను కార్తికేయ 2 మూవీ గురించి, తన సినీ కెరీర్ గురించి పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు.'ఎంతో శ్రమించి చిత్రబృందం అంతా కార్తికేయ 2 సినిమాను తెరకెక్కించింది. ఈ మూవీలో నా పాత్రకు రిలీజ్ తరువాత మంచి గుర్తింపు లభిస్తుంది. అలానే, మూవీ కూడా మంచి విజయం అందుకుంటుంది అని అనుపమ తెలిపింది.




## జవాన్ చిత్రంలో విలన్‌గా విజయ్ సేతుపతి

తన వెర్సటాలిటీతో తెలుగు, తమిళ, మలయాళ భాషల వారినే కాక బాలీవుడ్ వారిని కూడా ఇంప్రెస్ చేస్తున్నాడు విజయ్ సేతుపతి. అందుకే ప్రతి లాంగ్వేజ్‌లోనూ అతని కోసం అవకాశాలు క్యూ కడుతున్నాయి. ఔట్ సైడర్స్‌ని అత్యంత తక్కువగా ఎంకరేజ్ చేసే బీటౌన్ వారు సేతుపతి కోసం రెడ్ కార్పెట్ పరవడం నిజంగా విశేషమే. ఇప్పటికే అక్కడ రెండు సినిమాలు, ఒక వెబ్ సిరీస్ చేస్తున్న సేతుపతి.. ఇప్పుడు మరో మూవీకి సెలెక్టయ్యాడు. అది కూడా మామూలు చిత్రం కాదు. షారుఖ్ ఖాన్ హీరోగా అట్లీ తెరకెక్కిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ 'జవాన్'. సౌత్ డైరెక్టర్ కాబట్టి సేతుపతి అతని చాయిస్ అయ్యుండొచ్చనుకుంటారంతా. కానీ తన పేరుని ప్రపోజ్ చేసింది స్వయంగా షారుఖ్ అట. ఆ టీమ్‌లోని ఒకరి ద్వారా ఈ విషయం బైటికొచ్చింది. క్షణాల్లో వైరల్ అయ్యింది. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సేతుపతి మెయిన్ విలన్‌గా కనిపించబోతున్నాడు. నిజానికి ఈ పాత్ర రానా చేయాలి. కానీ పర్సనల్ రీజన్స్ వల్ల తను చేయలేకపోవడంతో సేతుపతిని సెలెక్ట్ చేశారట. మొత్తానికి తన నటనతో లాంగ్వేజ్ బ్యారియర్స్‌ని బద్దలు కొట్టేసి మరీ దూసుకుపోతున్నాడు సేతుపతి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in